క్లుప్తంగా

నాలుగు వేల జెండాలు సిద్ధం



దెందులూరు నర్సింగ్ కళాశాలలో సిద్ధం చేస్తున్న నాలుగు వేల జెండాలు

దెందులూరు: దెందులూరులో ప్రతి ఇంటికీ హిందూ సంప్రదాయాన్ని అనుసరించి ఆంజనేయుని చిత్రాన్ని ముద్రించిన 4వేల జెండాలను సిద్ధం చేస్తున్నామని రామదండు నిర్వాహకులు, కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. ఉగాది రోజున ప్రతి ఇంటికీ జెండాలను పంపిణీ చేస్తామన్నారు.

డాక్టర్ ప్రీతికి నివాళులు



దెందులూరులో డాక్టర్ ప్రీతికి నివాళులర్పిస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

దెందులూరు: డాక్టర్ ప్రీతి ఆకస్మిక మరణం బాధాకరమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ప్రీతి చిత్రపటం వద్ద క్యాండిల్స్ వెలిగించి నర్సింగ్ విద్యార్థినులు నివాళులర్పించారు. ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు దాత సాయం



చల్లచింతలపూడిలో శ్మశాన వాటికను జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

దెందులూరు: చల్లచింతలపూడిలో 50 సెంట్ల శ్మశానం స్థలంలో గోతులను పూడ్చేందుకు వైఎస్సార్ సీపీ వార్డు మెంబర్ నాగనబోయిన సునీల్‌కుమార్ ఆర్థిక సాయం అందించారు. శ్మశానంలో తుప్పలు, మొక్కలను తొలగించి, జేసీబీతో భూమిని చదును చేశారు. సునీల్ కుమార్‌ను సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అభినందించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

దెందులూరు: బాలబాలికలు ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించాలని నిరంతర సాధన, ప్రణాళికతో కృషి చేయాలని ఐసీడీఎస్ భీమడోలు ప్రాజెక్టు ఆఫీసర్ ఏ.విజయలక్ష్మి అన్నారు. గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అధ్యక్షతన ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మూఢ నమ్మకాలు, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా బాల్య వివాహాలు చేస్తే జరిగే నష్టాలను వివరించారు. సర్పంచ్ నాగమల్లేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు మాసగిరి శ్రీనివాస్ తదితరులున్నారు.

డీఎల్‌పీఓ ఆకస్మిక తనిఖీ

పెదపాడు: పంచాయతీరాజ్ డివిజనల్ ఆఫీసర్ టీ.అన్నామణి మంగళవారం అప్పనవీడు పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, కార్యదర్శి పద్మారావును తయారీ కేంద్రం నిర్వహణ, ఫలితాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామ కార్యదర్శులు, ఈఓఆర్‌డీలు, ఎంపీడీఓలు సంయుక్త సహకారంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ చేయాలన్నారు. అప్పనవీడు సంపద తయారీ కేంద్రం నిర్వహణపై కార్యదర్శి పద్మారావు, సర్పంచ్ ఝాన్సీ, సిబ్బంది విధి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసి అభినందించారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి

పెదవేగి : మండలంలోని గార్లమడుగు జెడ్పీ హైస్కూల్‌ను ఎంపీడీఓ రాజ్‌మనోజ్ మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా సన్నద్ధం కావాలన్నారు.

సీనియర్ టైలర్లకు సత్కారం

ఉంగుటూరు: టైలర్ వృత్తి చాలా పవిత్రమైనదని వైఎస్సార్ సీపీ వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఉంగుటూరులో టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దొంతంశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం ఏటా రూ.10 వేలు చేదోడు పథకంలో అందించి ఆదుకుంటోందన్నారు. ఈ సమావేశంలో విలియం హోప్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టైలర్ సంఘం అధ్యక్షుడు సారిక చల్లారావు, సీనియర్‌టైలర్ ముప్పన సత్యానారాయణ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదవేగి : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తాతా రమ్యకుమార్ చెప్పారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- జగనన్న గోరుముద్దలో పోషకాహారం
- రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రల పంపిణీ
- ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వైద్య పరీక్షలు
- 1వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకూ లబ్ధి



జల్లికొమ్మర స్కూల్లో విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

నిడమర్రు: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల నుంచి డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల వరకూ వారి ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ముఖ్యంగా వారిలో రక్తహీనతను నివారించేందుకు అంగన్‌వాడీలో నమోదైన చిన్నారులకు ఐరన్ సిరప్‌లు వారానికి రెండు సార్లు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఐరన్ మాత్రలు స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో వారంలో ఒకరోజు ఉచితంగా అందిస్తోంది. రాష్ట్రీయ కిషోర స్వాస్థ్యలో భాగంగా స్కూల్ హెల్త్ వెల్‌నెస్ ప్రోగ్రాంను ఏపీ వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.

ప్రతి వారం విద్యార్థులకు ఐరన్ మాత్రలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు ప్రతి బుధ, శనివారాల్లో ఐరన్ సిరప్‌లు, పాఠశాలల్లో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు రూపంలో ఆయా అంగన్‌వాడీ, స్కూల్, కాలేజీ పరిధిలోని స్థానిక వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్రమం తప్పకుండా అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి కార్యక్రమాలు తూతూ మంత్రంగా ఉండేవని, ప్రస్తుతం నిర్దిష్టమైన రికార్డుల నమోదుతో పక్కాగా విద్యార్థులకు ఐరన్ అందించే కార్యక్రమం అమలవుతోందని మండల స్థాయి ఆరోగ్య అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి బుధ, శనివారాల్లో ఐరన్‌ను సిరప్ రూపంలో అందిస్తుండగా, ప్రతి గురువారం 1నుంచి డిగ్రీ విద్యార్థుల వరకూ ఐరన్ (ఫెర్రస్ సల్ఫేడ్, పోలిక్ యాసిడ్ మిళితం) మాత్రలు రూపంలో పంపిణీ చేస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకూ పింక్ కలర్‌లో ఉండే ఐరన్ 150 ఎంజీ పవర్ మాత్రలు, 6వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు నీలిరంగులో ఉండే ఐరన్ 200 ఎంజీ పవర్ మాత్రలు ఇస్తున్నారు.



విద్యార్థులకు అందించే పింక్, బ్లూ కలర్ ఐరన్ మాత్రలు

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్కూల్ హెల్త్ వెల్‌నెస్ ప్రోగ్రాంను ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా 2020 నుంచి ఈ ఐరన్ మాత్రలు పంపిణీ ప్రారంభించింది. ఈ కార్యక్రమం అమలుల్లో భాగంగా ప్రతి యూపీ, ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు విద్యార్థులకు ఏ సమయంలో వెయ్యాలి, మాత్రలు తీసుకున్న సమయంలో సమస్యలు ఉత్పన్నమైతే ఏ విధంగా పరిష్కరించాలి వంటి అంశాలతో పాటు, 11 కౌమారుల అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ప్రతి వారం ఒక అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిండంతోపాటు వారి సందేహాలు నివృత్తి చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

శరీరంలో ఐరన్ లోపిస్తే రక్తహీనత



శరీరంలో ఐరన్ చాలా కీలకమైనది. ఆహారంలో ఐరన్ లోపం ఉంటే రక్తం ఎర్రగా ఉండే గుణాన్ని తగ్గిస్తుంది. ఎర్ర కర్త కణాల్లో హిమోగ్లోబిన్ పరిమాణాన్ని తగ్గిస్తుంది. ఈ స్థితినే రక్తహీనత లేదా అనీమియా అంటారు. దీంతో విద్యార్థుల్లో నీరసం, నిస్సత్తువ పెరిగి చదువులో వెనకబడతారు.

– డాక్టర్ కె. భాగ్యశ్రీ, మండల వైద్యాధికారి, నిడమర్రు

ప్రతి గురువారం ఐరన్ మాత్రల పంపిణీ



ప్రతి గురువారం స్కూల్, కాలేజీ విద్యార్థులకు ఐరన్‌మాత్రలు, అంగన్‌వాడీలో చిన్నారులకు ప్రతి బుధ, శనివారాల్లో ఐరన్ సిరప్ అందిస్తున్నాం. ప్రతి విద్యార్థులకు ఇప్పటికే హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి ఆయా వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి వారికి అవసరమైన మందులు అందించాము.

– బి. కనకలక్ష్మి, ఏఎన్‌ఎం, కొమ్మర

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన ఎంపీ కోటగిరి శ్రీధర్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసిన ఎంపీ కోటగిరి శ్రీధర్

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో ఎంపీ కోటగిరి శ్రీధర్ కలిశారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని వివరించి, ప్రాధాన్యత సమస్యలను ముఖ్యమంత్రికి ఆయన వివరించారు.

ఎంపీ శ్రీధర్‌ను కలిసిన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మధు

దెందులూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకాన్ని మధు ఎంపీకి తెలియజేశారు. మధును ఎంపీ శ్రీధర్ అభినందించి రైతు సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు రాష్ట్ర మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బేతి వెంకటేశ్వరరావు ఉన్నారు.

దుర్గమ్మ ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు



కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబను సత్కరిస్తున్న డైరెక్టర్ వేదకుమారి

దెందులూరు: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా భక్తులందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. మంగళవారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ గతంకంటే మెరుగ్గా భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ట్రస్టు బోర్డు చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబ శాశ్వత చర్యలు తీసుకున్నారన్నారు. మొదటి సమావేశంలోనే తీసుకున్న నిర్ణయాలను భక్తులు స్వాగతిస్తున్నారన్నారు. అమ్మవారి ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల ఏర్పాటు, భక్తులు ఆలయం పైకి వెళ్లేందుకు రెండు బస్సుల ఏర్పాటు, భక్తులందరికీ కుంకుమ పంపిణీ, మహిళా భక్తులకు అదనంగా దుస్తులు మార్చుకునే గదులు, పాదరక్షలు భద్రపరిచేందుకు వసతి వంటి ప్రధానమైన అంశాలతో పాటు మరో 13 నిర్ణయాలను తీసుకుని బోర్డు సమావేశంలోనే ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. అమ్మవారి ఆలయ బోర్డు మెంబర్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు తనకు కల్పించిన అవకాశాన్ని ఎప్పటికీ మరువలేనన్నారు. బోర్డు తీసుకున్న అన్ని నిర్ణయాలు అమ్మవారి భక్తురాలుగా తనకు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. తొలుత అమ్మవారి ఆలయంలో చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబను డైరెక్టర్‌గా సత్కరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దెందులూరు వైఎస్సార్‌సీపీ నాయకులు తొత్తడి కృష్ణ ఉన్నారు.

ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే మానవత లక్ష్యం



పోలసానిపల్లి గురుకుల కళాశాలలో మొక్కలు నాటుతున్న జిల్లా అధ్యక్షుడు ఆర్.గంగాధరరావు

భీమడోలు: మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. కురెళ్లగూడెం, పోలసానిపల్లిలో మంగళవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కురెళ్లగూడెంలో నిర్వహించిన సమావేశానికి మండల చైర్మన్ గుల్లా నూకరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ మానవత ద్వారా అనేక మందికి సేవలందిస్తున్నామని, మరింత మందిని సభ్యులుగా చేర్పించాలన్నారు. గ్రామంలోని రక్త నిర్ధారణ, కంటి వైద్య శిబిరాలను నిర్వహించాలని తీర్మానించారు. పోలసానిపల్లి గురుకుల కళాశాల ప్రాంగణంలో జంగారెడ్డిగూడెం మానవత రీజనల్ చైర్మన్ దల్లి రామాంజనేయరెడ్డి ఆర్థిక సాయంతో మామిడి, జామ, ఉసిరి, బాదం, సపోటా తదితర మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, గ్రామ కన్వీనర్ సాయి, పూర్వపు అధ్యక్షుడు ఉన్నమట్ల సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం మానవత ప్రతినిధులు సమ్మిటి శ్రీను పాల్గొన్నారు.

2న భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భీమడోలు: భీమడోలు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 2వతేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్టు భీమడోలు ఎంపీడీవో జీఎల్‌ఎస్‌వీ రాఘవన్ మంగళవారం తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఈ సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని అధికారులంతా తమ పరిధిలోని అభివృద్ధినివేదికలతో హాజరు కావాలని కోరారు.

సీవీ రామన్ సేవలు ఆదర్శనీయం



భీమడోలు మానసలో సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు



అన్నేవారిగూడెంలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు, చిన్నారులు

భీమడోలు: నోబెల్ అవార్డు గ్రహీత, భారతరత్న సీవీ రామన్ వైజ్ఞానిక శాస్త్రానికి వైద్యుడని, ఆయన సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలబాలికలు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. అన్నేవారిగూడెం యూపీ పాఠశాల, భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విజ్ఞాన దినోత్సాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు, సెమినార్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అన్నేవారిగూడెం యూపీ హెచ్‌ఎం షేక్ మస్తాన్, మానస స్కూల్ ప్రిన్సిపాల్ వై.రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్ సీవీ రామన్‌కు ఘన నివాళులు

దెందులూరు: జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్‌ఎన్‌ఎల్‌వీజీ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి వరుణ్, సీవీ రామన్ వేషధారణతో అందరినీ ఆకట్టుకున్నాడు.

సైన్సుతోనే సమాజ ప్రగతి

గణపవరం: రోజువారీ జీవితం సైన్సుతోనే ముడిపడి ఉందని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం సైన్సు దినోత్సవం సందర్భంగా కాలేజిలో సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులచే ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనలను తిలకించి, బహుమతులు అందజేశారు.

పెదవేగి మండలంలో..

పెదవేగి : సైన్స్ దినోత్సవాన్ని కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ జే రవీంద్ర అధ్యక్షతన పెదవేగి మండలం పినకడిమిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ ఎస్‌ఎస్‌ఏ నుంచి సీఎంఓ జె.రవీంద్ర, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగ కార్యదర్శి ఏ సర్వేశ్వరరావు, పినకడిమి హెచ్‌ఎం తేరా ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం

- గృహసారథులు, వలంటీర్లు బాధ్యులుగా వ్యవహరించాలి
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఉంగుటూరులో గృహసారథులు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



హాజరైన గృహసారథులు, వలంటీర్లు

ఉంగుటూరు: గృహసారథులు, వలంటీర్లు ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయడానికి సాయశక్తుల కృషి చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఉంగుటూరు, నారాయణపురంలో గృహసారథులు, వలంటీర్లతో నిర్వహించిన చైతన్య సభలలో వాసుబాబు మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లలో సీఎం జగన్ పరిపాలనలో రూ.2 లక్షల కోట్లు పైగా లబ్ధిదారులు ఖాతాల్లో నేరుగా వేశారని తెలిపారు. విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి తల్లిదండ్రులకు రూ.15 వేలు అందిస్తూ ఆర్థిక భరోసా కల్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. అర్హతే ప్రామాణికంగా కులమతాలకు, పార్టీలు తారతమ్యం లేకుండా పథకాలు అమలు చేస్తున్నామని ఈ విషయం ప్రజలకు ఇంటింటికీ తిరిగి తెలియజేయాలని సూచించారు. ఇంకా వివిధ కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్, ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టే విధంగా రాష్ట్రంలో 175 సీట్లు గెలిపించి వైఎస్సార్ సీపీ గెలిచే విధంగా పార్టీ శ్రేణులు, గృహసారథులు, వలంటీర్లు పాటుపడాలని అన్నారు. జెడ్పీటీసీ, ఏఎంసీ చైర్మన్లు, పార్టీ పదవుల్లో ఉన్నవారు, ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలు అందజేస్తారని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, దొంతంశెట్టి సత్యనారాయణ, పుప్పాలగోపి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, మంద జయలక్ష్మి, ఎంపీటీసీ సందక రాంబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యవంతమైన జీవనం



పూళ్లలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్

భీమడోలు: ప్రతి వ్యక్తి వ్యాయామం, ఆరోగ్య సూత్రాలు పాటించడం వల్ల ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందుతారని రాజమండ్రి వేద స్పైన్ సెంటర్ వెన్నుముక వైద్య నిపుణులు పి.తేజోఫణీంద్ర అన్నారు. పూళ్లలోని కల్లి కొండమ్మ, నాగరత్నమ్మ ఆసుపత్రిలో మంగళవారం పీఎంపీ వైద్యులు పెనుగొండ శ్రీనివాస్, డాక్టర్ పాండ్రాకుల స్వాతిల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ప్రారంభించారు. వైద్య నిపుణులు డాక్టర్ పి.తేజోఫణీంద్ర రోగులకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పూళ్ల పంచాయతీతో పాటు మండల పరిధిలోని 320 మందికి రోగులకు వైద్య పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులను అందజేసారు. ఎముకల పటిష్టతను తెలిసే బీఎండీ పరీక్షలు చేసి నిర్ధారణ నివేదికను అందజేసారు. ఈ కార్యక్రమంలో మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, పీఎంపీ వైద్యులు పి.పెద్దిరాజు, శ్రీనివాస్, ఆసుపత్రి కన్వీనర్ పెనుగొండ శ్రీనివాస్, సిబ్బంది కొండేటి వంశీ, కొండేటి పవన్, రోగులు పాల్గొన్నారు.

వైభవంగా శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం శివారు గ్రామమైన చింతాయిగూడెంలో నూతన శివాలయం నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. గత నెల 25 నుంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పంచాయతన సహిత ఉమాసోమనాథేశ్వర స్వామి ఆలయం నిర్మించారు. ఈ శివాలయంలో ప్రతిష్ఠించేందుకు మరకత లింగం ప్రత్యేకంగా తయారు చేయించారు. ఆ లింగానికి మంగళవారం పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఊరంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

నేటి నుంచి దండు మారెమ్మ జాతర

గణపవరం: గణపవరం, నిడమర్రు మండలాల ప్రజల ఆరాధ్యదైవం దండు మారెమ్మ జాతర మహోత్సవాలు మార్చి 1 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉత్సవాలు ఈనెల 8వ తేదీ బుధవారం వరకూ నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రకటించింది. జాతర సందర్భంగా ఆలయానికి రంగులువేసి, ఆలయ ప్రాంగణమంతా చలువ పందిర్లువేసి, విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం రాత్రి అమ్మవారి గవళ్లగుడుపు సేవ వైభవంగా నిర్వహించనున్నారు. గణపవరం, నిడమర్రు, ఉండి, పెంటపాడు, అత్తిలి, ఆకివీడు, ఉంగుటూరు మండలాలకు చెందిన 50 గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

పెదవేగి : పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ దిబ్బగూడెం సెంటర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న తండ్రీ కొడుకులు గాయపడ్డారు. ఏలూరు నుంచి లింగపాలెం మండలం బాదరాల నుంచి ద్విచక్ర వాహనంపై ఓ తండ్రీకొడుకులు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పెదవేగి నుంచి ఏలూరు వైపు ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి మితిమీరిన వేగంతో వస్తూ అదుపు తప్పి ఎదురుగా తండ్రీ కొడుకులు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

దెందులూరు: దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో మంగళవారం అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన వైనమిది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ సమీపంలోని కే.రామచంద్రపురానికి చెందిన కోలా ఉదయ్ (20), అభి, గోవింద్ ముగ్గురు కలిసి దెందులూరులోని స్వీట్స్ షాపులో నెలవారీ ఉద్యోగానికి చేరారు. అభి శనివారం ఊరు వెళ్లాడు. గోవింద్, ఉదయ్ రోజువారీగా పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చారు. మంగళవారం తెల్లవారుజామున వారు ఉంటున్న రెండు అంతస్తుల ఇంటి వద్ద కింద వసారా ప్రాంతంలో ఉదయం ఉదయ్ మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు.

నేడు మొయ్యేరులో గృహసారథుల సమావేశం

గణపవరం: మొయ్యేరులో సాయంత్రం 4 గంటలకు మొయ్యేరు, కోమర్రు, డి.కుముదవల్లి, ముప్పర్తిపాడు, వెంకట్రాజపురం, కేశవరం, కొండేపాడుకు చెందిన గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, పార్టీ కన్వీనర్లు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము తెలిపారు.